www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

ప్రభుత్వ భూములపై గిరిజనేతరుల పెత్తనమా?



6

హైదరాబాద్ సంపుటి: 05 సంచిక: 282 మంగళవారం 10-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు: 06 వెల : 5



కేంద్ర రాజకీయాల వైపు

కీలక మంత్రి

సొంతింటి వైపు
మాజీ ఎమ్మెల్యే చూపు

నా చోటు నాకు..
ఆ మంత్రికి ఎంపీ టికెట్టు

అప్పుడు త్యాగం చేశా..
ఇప్పుడు కావాలనుకుంటున్న

మంత్రిని ఎంపీగా
పంపాలనే ప్రతిపాదన..

అధిష్టానం వద్ద ప్రస్తావన

చాప కింద నీరులా లాబీయింగ్

హైదరాబాద్ కేంద్రంగా భారీ స్కెచ్

పార్టీ పెద్దలతో మాజీ "మంత్రాంగం"

రాజకీయప్రకంపనలకు వేదికగా
మారనున్న కీలక నియోజకవర్గం

ఏజెన్సీ రాజకీయాల్లో వేడి
పుట్టించనున్న సరికొత్త అంశం..

మాటకి కట్టుబడ్డ
మాజీ కి న్యాయం జరిగేనా..?

"తెలంగాణ రాష్ట్రంలో అత్యంత కీలకంగా ఉన్న ఓ మంత్రి జిల్లాలో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి.. ప్రస్తుతం ఆ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం పై భవిష్యత్తు ఎన్నికలకు సంబంధించిన వ్యవహారంపై ఇప్పుడే ఒక రసవత్తరమైన చర్చ సాగుతోంది. ప్రస్తుతం ఆ నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన ఒక కీలక నేత తీరు కారణంగా అక్కడ పార్టీ కి నష్టం కలిగించే పరిణామాలు చోటుచేసుకున్నాయని విమర్శలు సొంత పార్టీ నుండి వస్తున్నాయి. మంత్రి కి అత్యంత సన్నిహితుడని చెప్పబడే ఆ కీలక నాయకుని వ్యవహారం భవిష్యత్ రాజకీయాల్లో పరాభవం ఎదురయ్యే పరిస్థితి ఉందనే చర్చలు సాగుతున్న ఈ నేపథ్యంలోనే తాజాగా ఆ జిల్లాలో వెలుగు చూస్తున్న మరో అంశం రాజకీయంగా ఆసక్తిని రేపుతుంది.."

మిగతా వివరాలు 2లో..

- భద్రాద్రి న్యూస్ స్పెషల్ ఫోకస్

ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేందుకు
ముందస్తు చర్యలు

- తాగునీటి భద్రతకు అత్యంత ప్రాధాన్యత..
- సీతారామ జలాలతో నీటి వనరుల బలోపేతం
- వైరా జలాశయం ద్వారా ఎనిమిది మండలాలకు తాగునీటి భరోసా
- 20 చెరువుల్లో 1,058.65 మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీటి నిల్వ..
- 9,436 ఎకరాలకు సాగునీటి భద్రత
- జిల్లా కలెక్టర్ అంకిత్



3



5

బొగ్గు ఉత్పత్తిలో లక్ష్యాలను
అధిగమించాలి

- బొగ్గు ఉత్పత్తిలో లక్ష్యాలను అధిగమించాలి
- నాణ్యత, రవాణా, భద్రతలో రాజీ వద్దు
- అధికారులకు సింగరేణి ఈడీ బాధావత్ వెంకన్న ఆదేశం

ప్రైవేట్ చిట్టీల పేరుతో
రూ.55.33 లక్షలకు టోకరా!

- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అరెస్ట్..
- 11 చిట్టీల ద్వారా భారీగా వసూళ్లు



4

కేంద్ర రాజకీయాల వైపు కీలక మంత్రి



తెలంగాణ రాష్ట్రంలో అత్యంత కీలకంగా ఉన్న ఓ మంత్రి జిల్లాలో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి.. ప్రస్తుతం ఆ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం పై భవిష్యత్తు ఎన్నికలకు సంబంధించిన వ్యవహారంపై ఇప్పడే ఒక రసవత్తరమైన చర్చ సాగుతోంది. ప్రస్తుతం ఆ నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన ఒక కీలక నేత తీరు కారణంగా అక్కడ పార్టీ కి నష్టం కలిగించే పరిణామాలు చోటుచేసుకున్నాయని విమర్శలు సొంత పార్టీ నుండి వస్తున్నాయి. మంత్రి కి అత్యంత సన్నిహితుడని చెప్పబడే ఆ కీలక నాయకుని వ్యవహారం భవిష్యత్ రాజకీయాల్లో పరాభవం ఎదురయ్యే పరిస్థితి ఉందనే చర్చలు సాగుతున్న ఈ నేపథ్యంలోనే తాజాగా ఆ జిల్లాలో వెలుగు చూస్తున్న మరో అంశం రాజకీయంగా ఆసక్తిని రేపుతుంది..

- భద్రాద్రి న్యూస్ స్పెషల్ ఫోకస్

- **కేంద్ర రాజకీయాల వైపు "కీలక మంత్రి"**
- **సొంతింటి వైపు మాజీ ఎమ్మెల్యే చూపు**
- **నా చోటు నాకు..ఆ మంత్రికి ఎంపీ టికెట్టు**
- **- అప్పుడు త్యాగం చేశా.. ఇప్పుడు కావాలనుకుంటున్న**
- **మంత్రిని ఎంపీగా పంపాలనే ప్రతిపాదన..**
- **అభిష్టానం వద్ద ప్రస్తావన**
- **చాప కింద నీరులా లాబీయింగ్**
- **హైదరాబాద్ కేంద్రంగా భారీ స్కెచ్**
- **పార్టీ పెద్దలతో మాజీ "మంత్రాంగం"**
- **రాజకీయప్రకంపనలకు వేదికగా మారనున్న కీలక నియోజకవర్గం**
- **ఏజెన్సీ రాజకీయాల్లో వేడి పుట్టించనున్న సరికొత్త అంశం..**
- **మాటకి కట్టుబడ్డ మాజీ కి న్యాయం జరిగేనా..?**

రాష్ట్రంలో ఒక ప్రత్యేకమైన పేరు ఉన్న ముఖ్యమైన మంత్రి ఇలా కాలో ఒక ఆసక్తికరమైన అంశం గాలి కంటే వేగంగా దావానం లా వ్యాప్తి చెందుతుంది. ఆ కీలకమైన మంత్రి భవిష్యత్తులో కేంద్ర రాజకీయాల వైపు వెళుతున్నారని ఒక ప్రచారంపబ్లిక్ లోకి వెళ్తుంది. ఆ మంత్రికి కేంద్రస్థాయిలో సైతం గుర్తింపు ఉన్న నేపథ్యంలో భవిష్యత్తులో ఎంపీగా బరిలోకి దిగి కేంద్ర రాజకీయాల్లో కీలకంగా మారాలనే ఆలోచన చేస్తున్నారని వార్త చిన్నచిన్నగా ప్రజల్లోకి వెళుతున్న నేపథ్యంలో ఆ అంశం రాజకీయంగా తీవ్ర చర్చకు దారి తీస్తుంది.. ఒకవేళ మంత్రి ఎంపీగా బరిలోకి దిగి కేంద్ర రాజకీయాల్లోకి ప్రవేశిస్తే అదే సమయంలో ప్రస్తుతం ఆ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం నుండి ఎవరు పోటీ చేస్తారు అంశంపై ఆసక్తికరమైన ఊహాగానాలపై వెలుగు చూస్తున్న నేపథ్యంలో ఓ మాజీ ఎమ్మెల్యే ఆ నియోజకవర్గము నుండి బరిలో దిగుతారనే ప్రచారం కూడా జరుగుతుంది.. ప్రస్తుతం మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో అధికార పార్టీ కీలక నేత తీరు పార్టీ ప్రతిష్టకు భంగం వాటిల్లే పరిస్థితి వచ్చేసింది. ఈ క్రమంలో పార్టీ అభిమానులు నియోజకవర్గ వ్యాప్తంగా అసంతృప్తితో ఉన్నారు ఈ క్రమంలో ఆ నియోజకవర్గానికి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే తిరిగి సొంత గూటికి వచ్చి పోటీలో నిలబడాలనే ఆలోచన చేస్తుండడం రాజకీయాల్లో చిన్నగా ప్రకంపనలు మొదలయ్యాయి. మంత్రి కేంద్ర రాజకీయాల పట్లఆసక్తిగా ఉన్నారనే ప్రచారం ఓవైపు ఉండగానే మరోవైపు సొంత నియోజకవర్గాన్ని వదిలి వేరే ప్రాంతానికి వెళ్లిన ఒక కీలకమైన నేత తిరిగి సొంతగూటికి చేరేందుకు చేస్తున్న ప్రయత్నాలతో అధికార పార్టీ ఆసక్తికరమైన రాజకీయాలకు వేదికగా మారింది. ప్రస్తుతం ఆ నియోజకవర్గంలో ఆ జిల్లాకు చెందిన కీలక నాయకుడు వ్యవహార శైలి కారణంగా పార్టీ పరిస్థితి అటు ఇటుగా ఉందనే అభిప్రాయాలతో పాటు అధిష్టానానికి సైతం అదే నివేదిక వెళ్ళిందనే సమాచారం. ఈ క్రమంలోనే ఆ నియోజకవర్గంలో అధికార పార్టీ గెలుపు గతంలో మాదిరిగా నల్లేరు మీద నడక కాదనే అభిప్రాయాలు సొంత పార్టీ నేతల్లోనే ఉన్నాయి. మరో ఆరు నెలల తర్వాత అధికార పార్టీకి చెందిన ముఖ్యులు టిఆర్ఎస్ వైపు మొగ్గు చూపే అవకాశాలు కూడా ఉన్నాయని విశ్లేషణ జరుగుతుంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం ఆ జిల్లాకు ప్రాతినిధ్య వహిస్తున్న మంత్రి భవిష్యత్తులో కేంద్ర రాజకీయాల వైపు పయనిస్తే నియోజకవర్గానికి ప్రజాదరణ కలిగిన నేత అవసరం ఉంది అయితే. ఇదే జిల్లాకు చెందిన ప్రజాభిమానం చూరగున్న నాయకుడు అనుకోని పరిస్థితుల్లో అధిష్టానం మాటకు కట్టుబడి ఇక్కడ పోటీకి దూరం అవడం అప్పట్లో ఆయన చేసిన త్యాగంగా అభివర్ణించారు. అయితే ప్రస్తుతం మంత్రి కేంద్ర రాజకీయాల వైపు మొగ్గుచూపుతున్న పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ఓ మాజీ ఎమ్మెల్యే తిరిగి తన సొంత గూటి నుండే పోటీకి దిగాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తుంది అందులో భాగంగానే ఆ మాజీ తరచూ ఆ జిల్లాలో పర్యటిస్తూ ముఖ్యులను కలుస్తూ అభిమానులతో పాటు కాంగ్రెస్ క్యాడర్ తో తో చాప కింద నీరులా సత్సంబంధాలను నెలకొల్పుకుంటూ కొత్త రాజకీయాలకు శ్రీకారం చుడుతున్నారు. ఆ మాజీ కనక మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లా నుండి బరిలో దిగితే అటు సొంత పార్టీ నుండి కాకుండా ఇతర పార్టీల నుండి కూడా ఆయనకు మద్దతు లభిస్తుందనే అభిప్రాయాలు సైతం నియోజకవర్గ వ్యాప్తంగా వ్యక్తమవుతున్నాయి

చాప కింద నీరులా ప్రయత్నాలు షురూ

కీలకమైన మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం నుండి ఎలాగైనా పోటీ చేయాలనే యోచనతో మాజీ ఎమ్మెల్యే చాప కింద నీరుల పావులు కలుపుతున్నారనే ప్రచారం జోరుగా సాగుతుంది. ఇప్పటికే మంత్రికి అత్యంత సన్నితుడిగా ఉండే కీలక నాయకుడు పార్టీని చికాకు చేసి పడేశారని ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో పార్టీ పరిస్థితి అగమ్య గోచరంగా మారే అవకాశాలు ఉన్నాయని ఆవేదన కాంగ్రెస్ క్యాడర్లో నెలకొంది ఇదే క్రమంలో తమ ప్రాంతానికి చెందిన మాజీ ఎమ్మెల్యే మళ్లీ ఇక్కడకు వస్తున్నారని వార్త అటు కాంగ్రెస్ వర్గాల తో పాటు ఆ మాజీ సన్నిహితులకు శ్రేయోభిలాషులకు ఇతర పార్టీ ల్లోని అసంతృప్తి వాదులకు కాంగ్రెస్లోని సీనియర్ నాయకత్వానికి ఒక సానుకూల దృక్పథం ఏర్పడుతుంది. ఈ అంశాలను అవకాశంగా తీసుకుంటున్న మాజీ పార్టీ పెద్దల దగ్గర పావులకు కదుపుతున్నారని తెలుస్తోంది. మంత్రి ఎలాగు కేంద్ర రాజకీయాల వైపు ఆసక్తితో ఉన్నారు కాబట్టి తన సొంత ప్రాంతం నుండి తాను తిరిగి పోటీ చేస్తానని అప్పుడు త్యాగం చేశానని ఇప్పుడు కావాలంటున్నాను అంటూ హైదరాబాద్ కేంద్రంగా కొందరు పార్టీ ముఖ్య ల వద్ద తన అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టినట్లుగా తెలుస్తోంది. మాజీ కి సానుకూలంగా ఉండే పార్టీ ప్రముఖుల సైతం మాజీ వాదనను అభిప్రాయాన్ని ప్రతిపాదనను పరిశీలించి ఆలోచన చేస్తున్నట్లుగా సమాచారం. ఇదంతా కీలక మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతంలో చర్చనీయాంసంగా మారుతున్నక్రమంలో ఆ జిల్లా భవిష్యత్ రాజకీయాలు రాష్ట్రవ్యాప్త సంచలనానికి దారితీసే అవకాశాలు కనిపిస్తున్నాయి

రాష్ట్రస్థాయి గోవిజ్ఞాన పరీక్షకు రవీంద్ర భారతి విద్యార్థుల ఎంపిక

- **జిల్లాస్థాయి పరీక్షలో ప్రతిభ చాటిన ఐదుగురు విద్యార్థులు.. పాఠశాల యాజమాన్యం అభినందనలు**

ముదిగొండ, నవంబర్ 9 (భద్రాద్రిన్యూస్):

జిల్లాస్థాయి గోవిజ్ఞాన పరీక్షలో ప్రతిభ కనబరిచి రవీంద్ర భారతి హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పరీక్షకు ఎంపికయ్యారు. ముదిగొండ మండలం అమ్మపేట గ్రామంలోని రవీంద్ర భారతి పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఈ ఘనత సాధించారు.

ఈ నెల 6వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి గోవిజ్ఞాన పరీక్షలో పాఠశాలకు చెందిన బి. అభిరామ్, ఎస్.కె. సమీనా, కె. నక్షత్ర, పి. ప్రమీల, ఎన్. తేజస్విని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ నెల 15న హైదరాబాద్‌లోని సర్దార్ పటేల్ ఆడిటోరియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పరీక్షలో వీరు పాల్గొననున్నారు.

విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ ఎం.వి. రమణ, డైరెక్టర్ ఎం. రాజేశ్వరి, ప్రధానోపాధ్యాయులు ఎం. నరేష్ కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



ఖమ్మం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఘనంగా దీపావళి వేడుకలు

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 9(భద్రాద్రిన్యూస్):-

దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఖమ్మం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా వ్యాపార సోదరులందరికీ నాయకులు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు . ప్రతి వ్యాపారవేత్త కుటుంబంలో సుఖసంతోషాలు , ఆయురారోగ్యాలు , ఐశ్వర్యం వెల్లివిరియాలని , వ్యాపారాలు మరింత అభివృద్ధి చెంది ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు . ప్రతి ఇంటా ఆనంద దీపాలు వెలగాలని , అందరి జీవితాల్లో సంతోషం , శాంతి , సౌభాగ్యాలు నిండాలని కోరుకున్నారు . ఈ కార్యక్రమంలో ఖమ్మం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కురివెల్ల ప్రవీణ్ , ఉపాధ్యక్షులు బత్తిని నరసింహారావు , ప్రధాన కార్యదర్శి జి.వై. నరేష్ తదితరులు పాల్గొన్నారు .



ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు

- **తాగునీటి భద్రతకు అత్యంత ప్రాధాన్యత.. సీతారామ జలాలతో నీటి వనరుల బలోపేతం**
- **వైరా జలాశయం ద్వారా ఎనిమిది మండలాలకు తాగునీటి భరోసా**
- **20 చెరువుల్లో 1,058.65 మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీటి నిల్వ.. 9,436 ఎకరాలకు సాగునీటి భద్రత**
- **జిల్లా కలెక్టర్ అంకిత్**

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 9 (భద్రాద్రిన్యూస్):

ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో వర్షాభావ, కరువు పరిస్థితులు ఏర్పడినా జిల్లాలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. తాగునీటి భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను జలాశయాలు, చెరువులకు మళ్లించి నీటి వనరులను బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు.

202627 వ్యవసాయ సంవత్సరంలో ఎల్‌నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని నీటి వనరుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని కఠిన రాతి నేలల ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు తగ్గడం, చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు అడుగంటడం వంటి పరిస్థితులు తలెత్తితే తాగునీటి అవసరాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో గోదావరి జలాలను ప్రత్యామ్నాయ వనరుగా వినియోగించుకునేందుకు సీతారామ ఎత్తిపోతల పథకం కీలకంగా మారిందని వివరించారు.

సుమారు 17,150 ఎకరాలకు సాగునీరు అందించే సామర్థ్యం కలిగిన వైరా జలాశయం నీటిమట్టం డెడ్‌స్టోరేజీ స్థాయికి చేరుకున్న నేపథ్యంలో సీతారామ పథకంలోని రాజీవ్ కాలువ ద్వారా గోదావరి జలాలను మళ్లించి జలాశయాన్ని నింపేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. దీనివల్ల వైరా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఎనిమిది మండలాల ప్రజలకు తాగునీటి సరఫరాకు భరోసా కల్పించే అవకాశం ఏర్పడిందన్నారు.

సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా అశ్వాపురం మండలం బి.జి. కొత్తూరు పంప్‌హౌస్1 వద్ద ఖరీఫ్ 2026 సీజన్‌లో 1,604 గంటల పాటు భారీ మోటార్లను నిర్వహించి గోదావరి నది నుంచి 9.088 టీఎంసీల నీటిని ప్రధాన కాలువలోకి ఎత్తిపోసినట్లు వెల్లడించారు. వి.కె. రామవరం వద్ద పంప్‌హౌస్2, కమలాపురం వద్ద పంప్‌హౌస్3 ద్వారా కూడా నీటిని వివిధ ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు.

ఈ నీటి మళ్లింపు ద్వారా ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు, సుజాతనగర్, తల్లాడ తదితర మండలాల్లోని నీటి వనరులకు ప్రయోజనం చేకూరిందన్నారు. సీతారామ పథకంలోని ప్యాకేజీలు 4, 7, 8, 9, 18ఎల్ రాజీవ్ కాలువ పరిధిలోని 20 మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో మొత్తం 1,058.65 మిలియన్ క్యూబిక్ ఫీట్ల గోదావరి జలాలను నిల్వ చేసినట్లు వివరించారు. తద్వారా ప్రత్యక్షంగా 9,436 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి భద్రత కల్పించినట్లు పేర్కొన్నారు.

ములకలపల్లి మండలంలోని ఏడుళ్లవాగు, పెద్దయ్య, శ్రీరాములు, తుమ్మకుంట, ఊరచెరువు, ఏడుళ్ల చెరువులు; అన్నపురెడ్డిపల్లి మండలంలోని వెంగళ రావు సాగర్, పెద్దచెరువు; అన్నదైవం ప్రాజెక్టు; చంద్రుగొండ మండలంలోని మద్దుకూరు ప్రాజెక్టు, జంట్లకుంట, గంద్ర వీరయ్య కుంట, శనగకుంట; జూలూరుపాడు మండలంలోని మేడికుంట, ఎర్రవాగు ప్రాజెక్టు, శనగచెరువు; సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం ప్రాజెక్టు; తల్లాడ మండలంలోని సుబ్బమ్మ చెరువు, బ్రాహ్మణపల్లి చెరువు, ఓర చెరువుల్లో నీటి నిల్వలను పెంచినట్లు తెలిపారు.

చెరువుల్లో నీటిని నిల్వ చేయడం వల్ల రైతులకు సాగునీటి భరోసా కలగడంతో పాటు పశువుల అవసరాలు, స్థానిక నీటి అవసరాలకు కూడా ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు. కఠిన రాతి



రాలకు సాగునీటి భద్రత కల్పించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు తీవ్రతరమైనా తాగునీటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలను ముందుగానే అంచనా వేస్తూ నీటి నిల్వలను అందుబాటులో ఉంచాలని, సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. పైప్‌లైన్ల లీకేజీలను అరికట్టడం, అవసరమైన చోట తక్షణ మరమ్మతులు చేపట్టడం, నీటి వృథాను నివారించడం, ప్రజలకు నీటి పొదుపుపై అవగాహన కల్పించడం వంటి చర్యలు నిరంతరం చేపట్టాలని తెలిపారు.

ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్తు తరాల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న వనరులను సంరక్షించుకోవాలని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవడంతో జిల్లాలో తాగునీటి భద్రతకు భరోసా కల్పించడంతో పాటు సాగునీటి వనరులను బలోపేతం చేయడం, భూగర్భ జలాల పెంపునకు దోహదపడటం సాధ్యమైందని తెలిపారు.

సీఎం పదవికే వన్నె తెచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- **దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన నాయకుడు.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలనకొత్వాల శ్రీనివాసరావు**

పాల్వంచ, నవంబర్ 9 (భద్రాద్రిన్యూస్):

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ ముఖ్యమంత్రి పదవికే వన్నె తెచ్చారని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్కఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు కొనియాడారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం దీపావళి పర్వదినం సందర్భంగా పాల్వంచలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా వేడుకలు నిర్వహించాయి. అయ్యప్పనగర్‌లోని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ పార్టీ బలోపేతానికి రేవంత్ రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీల విమర్శలను సమర్థవంతంగా ఎదుర్కొంటూ పాలనలో తనదైన ముద్ర వేస్తున్నారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పేరు సంపాదించుకున్నారని ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరరావు, కార్పొరేటర్ కాల్వ భాస్కర్ రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మహీపతి రామలింగం, కొండం వెంకన్నగౌడ్, సాదం రామకృష్ణారావు, నరిగె సుజాత, పైడిపల్లి మహేష్, వై. వెంకటేశ్వరరావు, చింతా నాగరాజు, డిష్ నాగేశ్వరరావు, వాసుమల్ల సుందర్ రావు, కొమర్రాజు విజయ్, డప్పు రాము, షేక్ షఫీ, ధర్మసోత్ ఉపేందర్ నాయక్, పాకాలపాటి రోశయ్య చౌదరి, షేక్ దస్తగిరి, షేక్ బాషా, షేక్ మదార్, ఆటో మల్లికార్జున్, కటుకూరి శేఖర్, లోగాని రామకృష్ణ, పట్టా వీరకుమార్, ఇంజా దుర్గారావు (బాబీ), బూసి శ్రీను, బండి నాగరాజు, కె. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



బూర్గంపాడు ఆసుపత్రిలో కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీ

- **గైనకాలజిస్ట్ ప్రతిరోజూ అందుబాటులో ఉండాలి.. వైద్యులు, సిబ్బంది 24 గంటలు విధుల్లో ఉండాలి**
- **రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి.. నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు**

బూర్గంపాడు, నవంబర్ 9 (భద్రాద్రిన్యూస్):

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటూ రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. సోమవారం బూర్గంపాడు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది హాజరు, వైద్య సేవలు, మందుల లభ్యత, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ అందుబాటులో లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్ వైద్యాధికారిని వివరణ కోరారు. గైనకాలజిస్ట్ రోజు విడిచి రోజు విధులకు హాజరవుతున్నారని అధికారులు తెలపడంతో, వెంటనే డీసీహెచ్ఎస్‌కు ఫోన్ చేసి గైనకాలజిస్ట్ ప్రతిరోజూ ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణులు, మహిళా రోగులకు వైద్య సేవల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు.

అనంతరం రక్తపరీక్షల కేంద్రాన్ని సందర్శించి రోజువారీగా నిర్వహిస్తున్న పరీక్షల సంఖ్య, అందుబాటులో ఉన్న పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి జాప్యం లేకుండా తక్షణ వైద్య సేవలు అందించాలని సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి గౌరవప్రదంగా వైద్యం అందించడం వైద్య సిబ్బంది బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. అత్యవసర వైద్య సేవలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మెరుగైన వైద్యం కోసం ఇతర ఆసుపత్రులకు తరలించాల్సిన సందర్భాల్లో ఎలాంటి జాప్యం చేయరాదని స్పష్టం చేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. వార్డులు, మరుగుదొడ్లు, రోగులు వేచి ఉండే ప్రదేశాలను నిరంతరం శుభ్రంగా ఉంచాలని, చెత్తాచెదారం పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆసుపత్రి ప్రాంగణంలోని విద్యుత్ మీటర్ వద్ద వైర్లు బయటకు వచ్చి ఉండటాన్ని గమనించి, వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి మరమ్మతులు చేయించాలని, రోగులు, సిబ్బందికి ఎలాంటి ప్రమాదం జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఇన్‌పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులకు ఆహారం తయారు చేసే వంటశాలను పరిశీలించారు. రోగులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, ఆహార తయారీలో పరిశుభ్రత పాటించాలని వంట సిబ్బందికి సూచించారు. ఆసుపత్రిలో మందుల లభ్యత, ఇతర సమస్యలపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇన్‌పేషెంట్ వార్డులో 15 మంది రోగులు చికిత్స పొందుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

అనంతరం ఆసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించారు. నిర్మాణ పనుల్లో కార్మికుల సంఖ్య తక్కువగా ఉండటంపై కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. తగినంత మంది కార్మికులను నియమించి పనులను వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులోగా భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ తనిఖీలో సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి, వైద్యులు, వైద్య సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





కరువు మండలాలను వెంటనే ప్రకటించాలి

- **నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలి**
- **నేడు ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయండి**
- **సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 9 (భద్రాద్రిన్యూస్):-



రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా తక్షణమే భద్రాద్రి కొత్తగూడెం జిలాని కరువు జిల్లాగా ప్రకటించాలని అదేవిధంగా రాష్ట్రంలో కరువు మండలాలను గుర్తించి ప్రకటించాలని, పంట నష్టపరిహారంతో పాటు సహాయక చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా డిమాండ్ చేశారు. ఈ ప్రధాన డిమాండ్లపై నేడు ఉదయం 10 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే మహాధర్నాకు సంబంధించిన సోమవారం అయన మీడియాతో మాట్లాడారు. వర్షాభావం, భూగర్భ జలాలు అడుగంటడంతో తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని, పొట్టకొచ్చిన పంటలు నీరందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతలు లేకుండా వ్యవసాయానికి నాణ్యమైన కరెంట్ సరఫరా చేయాలని, ఎకరానికి వరికి రూ.30 వేలు, పత్తి, మిర్చికి రూ.50 వేల నష్టపరిహారం చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. కౌలు రైతులకూ పరిహారం ఇవ్వాలని, ఉపాధి హామీ పనులతో పాటు పశుగ్రాసాన్ని ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం ఈ డిమాండ్ల పరిస్కారంకోసం సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ఈ ధర్నాకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. జిల్లా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార సాధన కోసం తలపెట్టిన ఈ పోరాటంలో పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అన్నదాతలు, అన్నివర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



ఆప్యాయతల వెలుగుల్లో త్రివేణి హాస్టల్ విద్యార్థుల దీపావళి సంబరాలు

- **తల్లిదండ్రుల ప్రేమను మైమరిపించిన గురువులు**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 9(భద్రాద్రిన్యూస్):-

ఖమ్మంలోని త్రివేణి పాఠశాల హాస్టల్ విద్యార్థులు దీపావళి పండుగను ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సి.ఓ. అడ్మిన్ అప్పారావు, ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్, హాస్టల్ ఇంచార్జ్ వేణు, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్ విద్యార్థులతో కలిసి బాణాసంచా కాల్చి సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ.. కుటుంబాలకు దూరంగా ఉంటున్న హాస్టల్ విద్యార్థులకు పండుగల సమయంలో కుటుంబ వాతావరణాన్ని కల్పించడం ఎంతో ఆనందదాయకమని, విద్యతో పాటు ఆనందం, ఆత్మీయత, విలువలు కూడా విద్యార్థుల ఎదుగుదలలో ముఖ్యమని తెలిపారు.

ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు పండుగలను ఆనందంగా జరుపుకుంటూనే భద్రతా నియమాలు పాటించాలని, ఐక మత్యం, ఆప్యాయతలను అలవర్చుకోవాలని సూచించారు.

విద్యార్థులకు ఆత్మీయతను పంచుతూ నిర్వహించిన ఈ వేడుకలు వారి ముఖాల్లో ఆనందాల వెలుగులు నింపాయి.



కరువు బాధిత రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం అందించాలి!

- **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలి – సీపీఎం నేత కే. నరేంద్ర డిమాండ్**

కారేపల్లి, (భద్రాద్రి న్యూస్ రాములు):

కరువు పరిస్థితులతో పంటలు నష్టపోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున తక్షణ ఆర్థిక సాయం అందించాలని సీపీఎం సింగరేణి మండల కార్యదర్శి కే. నరేంద్ర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రైతులతో పాటు వ్యవసాయ కార్మిక కుటుంబాలను కూడా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

సీపీఎం సీనియర్ నాయకులు వినోద్ రావు, రవికుమార్ 30వ వర్ధంతి కార్యక్రమాన్ని అజ్మీర శోభన్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సంద ర్భంగా కే. నరేంద్ర మాట్లాడుతూ.. కరువు పరిస్థితుల కారణంగా పంటలు దెబ్బతిని రైతులు అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలను గుర్తించి ప్రభుత్వాలు తక్షణమే స్పందించాలని, కరువు నివారణకు సమగ్ర ప్రణాళిక రూపొందించి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు.

అలాగే నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజ లపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపు జరుగుతోందంటూ ఆయన విమర్శలు చేశారు.

అనంతరం సీపీఎం నాయకులు వినోద్ రావు, రవికుమార్ చిత్రపటాలకు రామారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మన్నెం బ్రహ్మయ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ధరావత్ వినోద్ కుమార్, రాసబంటి పుల్లయ్య, పోతురాజు చందర్రావు, షేర్ వెం కటేశ్వర్లు, కోరం అప్పారావు, గోకినపల్లి భారత లక్ష్మి, అజ్మీర రాందాస్, భూక్య శ్రీను, రాచర్ల రణధీర్, పుప్పాల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణి దరఖాస్తులకు గడువులోగా పరిష్కారం చూపాలి

- **ప్రజా సమస్యల పరిష్కారమే అధికారుల ప్రథమ కర్తవ్యం**
- **పెండింగ్ వినతులపై ప్రత్యేక దృష్టి సారించాలి: కలెక్టర్ అంకిత్**

కొత్తగూడెం, నవంబర్ 9 (భద్రాద్రిన్యూస్):

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం గా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

సోమవారం కొత్తగూడెంలోని ఐడీఓసీ కార్యాలయం లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్‌తో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. భూ సమస్య లు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, పింఛన్లు, గృహాలు, ఉపాధి, మౌలిక సదుపాయాలు తదితర సమస్యలను ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య స్వభావం, అర్హతలను బట్టి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పదేపదే కార్యాలయాల చుట్టూ తి రగాల్సిన పరిస్థితి రాకుండా చూడాలని, దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా నిర్ణీత గడువు లోగా చర్యలు పూర్తి చేయాలని ఆదేశించారు.

పెండింగ్‌లో ఉన్న వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటిపై తీసుకుంటున్న చర్యల ను ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ఒక శాఖకు సంబంధించిన సమస్య పరిష్కారంలో ఇతర శాఖల సహకారం అవసరమైతే పరస్పర సమన్వయం తో ముందుకు సాగాలని తెలిపారు. పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను నమోదు చేసి, సంబంధిత దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని పే





ర్కొన్నారు.

ప్రజావాణిలో వెలుగుచూసిన ప్రధాన సమస్యలు

ఆర్ఓఎఫ్ఆర్ పట్టా బదిలీ చేయాలని వినతి:

సుజాతనగర్ మండలం గరీబ్‌పేట గ్రామపంచాయ తీ పరిధిలోని లక్ష్మీపురం తండాకు చెందిన లకావత్ రమేష్ తన తండ్రి మాస్య రెండేళ్ల క్రితం మరణించా రని, ఆయన పేరుపై ఉన్న ఆర్ఓఎఫ్ఆర్ పట్టాను తన పేరుపై బదిలీ చేయించేందుకు పలుమార్లు దర ఖాస్తు చేసినా పరిష్కారం కాలేదని కలెక్టర్‌కు విన్న వించారు. పట్టా బదిలీ కాకపోవడంతో రైతు భరోసా పొందడంతో పాటు పత్తి విక్రయానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ వినతిపై తగిన చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి కలెక్టర్ ఎండార్స్ చేశారు.

హేమచంద్రపురం రహదారికి మరమ్మతులు చేపట్టాలి:

కొత్తగూడెం పోస్టాఫీస్ నుంచి హేమచంద్రపురం వరకు రహదారి అధ్వానంగా మారిందని, భారీ లారీల రాకపోకలతో గుంతలు ఏర్పడి దుమ్ము, ధూళి విపరీతంగా వ్యాపిస్తోందని శేషగిరినగర్‌కు చెందిన లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు. దుమ్ము కారణంగా గ్రామ స్థులు శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు పడుతు న్నారని తెలిపారు. రహదారి పనులు త్వరగా పూర్తి చేయడంతో పాటు అప్పటివరకు రోజుకు మూడు సార్లు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని చల్లించాలని కోరారు. ఈ మేరకు సింగరేణి జనరల్ మేనేజర్‌కు కలెక్టర్ ఆదేశాల నిమిత్తం వినతిని పంపించారు.

వృద్ధుడికి రక్షణ కల్పించాలని ఫిర్యాదు:

ఇల్లందు పట్టణంలోని రెండో నంబర్ బస్తీ, ఐదో వార్డుకు చెందిన 70 ఏళ్ల మొండయ్య తనకు వినికిడి లోపం ఉందని, కుమారుడు మరణించినప్పటి నుంచి కోడలు, మనవడు తనను పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. గత కొన్ని రోజులుగా తనపై దాడులకు పాల్పడుతూ దూషిస్తున్నారని, మూడు రోజులుగా భోజనం కూడా పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు రక్షణ కల్పించి, వేధింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ అధికారులకు కలెక్టర్ ఎండార్స్ చేశారు.

వాగు, వ్యవసాయ భూమి ఆక్రమణపై విచారణ జరపాలి:

టేకులపల్లి మండలం జత్యా తండాకు చెందిన భూక్యా పూల్‌సింగ్ తమకు వంశపారంపర్యంగా 3.26 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, తన భార్య పేరుపై మరో ఎకరం భూమి ఉందని తెలిపారు. ఈ భూముల మధ్య నుంచి ప్రవహించే చిన్న వాగును తమ కుటుంబం వ్యవసాయ అవసరాలకు తరత రాలుగా వినియోగించుకుంటోందని పేర్కొన్నారు. అయితే ఐదేళ్ల క్రితం లక్ష్మీ తండాకు చెందిన భూక్యా మంగీలాల్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు వాగును, దాని ఇరువైపులా ఉన్న తమ భూమిలో కొంత భాగాన్ని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి ఆక్రమణలు తొలగించి తమ భూమిని తిరిగి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వినతిని పరిశీలించిన కలెక్టర్ తగిన చర్యల నిమిత్తం ఈసెక్షన్ సూపరింటెండెంట్‌కు ఎండార్స్ చేశారు .ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

ఐలయ్యకు గౌరవ డాక్టరేట్

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 9 (భద్రా-ద్రిన్యూస్):-

ప్రముఖ రచయిత, కవి, జర్నలిస్ట్, విశ్రాంతోపా ధ్యాయుడు పంజాల ఐలయ్య కు గౌరవ డాక్టరేట్ లభించింది. ఆదివారం గ్లోబల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ ద్వారా హైదరా బాద్ ఓ ప్రైవేట్ హోటల్లో ఏర్పాటుచే సిన వెబ్బికి యూనివ ర్సిటీ కాన్వకేషన్ లో ఆయనకు ఈ డాక్టరేట్ ప్రదానం చేశారు. విజ్ఞాన విద్య,సా మాజిక అభివృద్ధిలో గత 35 ఏళ్లుగా ఆయన చేసిన విశేష సేవలను వెబ్బికి యూనివ ర్సిటీ గుర్తించింది.తరగతి గది బోధనకే పరిమితం కాకుండా సామాజిక విద్య, పర్యావరణం పరిర క్షణ కార్యక్రమా ల్లో ఐలయ్య చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హర్యానా హిమాచల్ ప్రదేశ్ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచార్యు లు, రామకృష్ణ ఉప్పల శ్రీనివాస్ గుప్తా



చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ ను అందించారు. పంజాల ఐలయ్యకు గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల పలువురు ఉపా ధ్యాయులు, కవులు, కళాకారులు ఐలయ్యను అభినందిం చారు.

పైవేట్ చిట్టీల పేరుతో రూ.55.33 లక్షలకు టోకరా!

- **ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అరెస్ట్.. 11 చిట్టీల ద్వారా భారీగా వసూళ్లు**

కొత్తగూడెం అర్బన్ , నవంబర్ 9 (భద్రాద్రిన్యూస్):

పైవేట్ చిట్టీల పేరుతో ప్రజల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి తిరిగి చెల్లించకుండా మోసాలకు పాల్పడిన ముగ్గురు నిందితులను కొత్త గూడెం త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. మొత్తం రూ.55,33,745 మేర ఖాతాదారులను మోసం చేసి నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

కొత్తగూడెం పట్టణంలోని న్యూ గొల్లగూడెంకు చెందిన కట్టుల సరోజ (62), కట్టుల చంద్రకళ (37), కట్టుల కుమార్ (40) కలిసి మొత్తం 11 పైవేట్ చిట్టీలు నిర్వ హించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో ఖాతాదారుల నుంచి రూ.55,33,745 వసూలు చేసి, చిట్టీల గడువు పూర్తయినప్పటికీ డబ్బులు తిరిగి చెల్లిం చకుండా మోసానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. ఈ వ్యవహారంపై కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 188/2026 కింద కేసు నమోదైంది. నమ్మదగిన సమాచారం మేరకు కొత్తగూ డెం రైల్వే స్టేషన్ వద్ద ముగ్గురు నిందితులను త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో కలిసి అదు



పులోకి తీసుకున్నారు. వారి వద్ద చిట్టీల లావాదేవీల వివరాలు నమోదు చేసిన ఐదు పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ముగ్గురినీ అరెస్ట్ చేసి న్యా యస్థానం ముందు హాజరుపరిచినట్లు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ వెల్లడించారు.

ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అధిక లాభాల ఆశతో అనధికారిక ప్రైవేట్ చిట్టీలలో చేరి ప్రజలు తమ కష్టార్జితాన్ని కోల్పోవద్దని సూచించారు. చిట్టీలలో చేరే ముందు నిర్వాహకుల చట్టబద్ధత, ప్రభుత్వ అనుమతు లను తప్పనిసరిగా పరిశీలించాలని, సరైన రసీదులు, రికార్డులు లేకుండా నగదు చెల్లించవద్దని కోరారు. చట్టవిరుద్ధంగా చిట్టీలు నిర్వహిస్తూ ప్రజలను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు.కేసును ఛేదించి నిందితులను అరెస్ట్‌చేసిన త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అభినందించారు.ప్రజలను ఆర్థిక మోసాలనుంచిరక్షించేందుకునిరంతరం అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులకు సూచించారు.

బొగ్గు ఉత్పత్తిలో లక్ష్యాలను అధిగమించాలి

- **నాణ్యత, రవాణా, భద్రతలో రాజీ వద్దు**
- **అధికారులకు సింగరేణి ఈడీ బాధావత్ వెంకన్న ఆదేశం**

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 9 (భద్రాద్రిన్యూస్):-



బొగ్గు ఉత్పత్తిలో నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించడంతో పాటు నాణ్యత, రవాణా, భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా సమన్వయంతో పనిచేయాలని సింగరేణి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) బాధావత్ వెంకన్న ఐఆర్‌టీఎస్ అధికారులను ఆదేశించారు.

సోమవారం కొత్తగూడెం ఏరియాలోని వీకే కోల్ మైన్స్, ఆర్‌సీహెచ్‌పీ ప్రాంతాలను ఆయన ఏరియా జనరల్ మేనేజర్ సీహెచ్ వెంకటరమణ, సంబంధిత అధికారులు, విభాగాధిపతులతో కలిసి సందర్శించారు.

వీకే కోల్ మైన్స్ వ్యూ పాయింట్ నుంచి ఓవర్‌బర్డెన్ (ఓబీ) తొలగింపు పనులను పరిశీలించారు. మట్టి తొలగింపు పనులను వేగవంతంగా పూర్తి చేసి బొగ్గు ఉత్పత్తిని పెంచాలని అధికారులకు సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగూడెం ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు చేపడుతున్న చర్యలపై ఆరా తీశారు. మెరుగైన ఉత్పత్తి సాధనకు అవసరమైన ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా ఏరియా జీఎం సీహెచ్ వెంకటరమణ వీకే ఓసీ ప్రాజెక్టు ఉపరితల గని వివరాలు, సంబంధిత రికార్డులను ఈడీకి వివరించారు. రోజువారీ బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ బ్లాస్టింగ్, లోడింగ్ పనుల పురోగతిని తెలియజేశారు.

అనంతరం బొగ్గు నాణ్యతను పరిశీలించిన ఈడీ, వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రోజువారీ ఉత్పత్తి, రవాణా లక్ష్యాలను అధిగమించడంతో పాటు బొగ్గు రవాణాకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉపరితల గనుల్లో పనిచేసే ఉద్యోగుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ రక్షణ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

ఆర్‌సీహెచ్‌పీ నుంచి రైలుమార్గం ద్వారా జరుగుతున్న బొగ్గు రవాణాను కూడా పరిశీలించారు. వివిధ బొగ్గు గ్రేడ్ల నాణ్యతను తనిఖీ చేసి, వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేసేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఈ పర్యటనలో జీఎంతో పాటు ఎస్ఓటు జీఎం గోవిందరావు, ఏరియా ఇంజనీర్ విత్తనాల రామకృష్ణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, వీకే సీఎం మేనేజర్ మురళి, సెక్యూరిటీ ఆఫీసర్ అభిలాష్ తదితర విభాగాధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

ఆదివాసీ ఉపాధ్యాయుల హక్కుల సాధనలో ఏటీఏది కీలక పాత్ర

- **15 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో విజయాలు.. మరెన్నో లక్ష్యాలు**
- **ఏటీఏ ఆవిర్భావ వేడుకల్లో జిల్లా అధ్యక్షుడు బిజ్జా శ్రీనివాస్**

పాల్వంచ, నవంబర్ 9 (భద్రాద్రిన్యూస్):



ఆదివాసీ ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం, పదోన్నతుల సాధన కోసం ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఏటీఏ) నిరంతరం పోరాటం సాగిస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బిజ్జా శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పాల్వంచలోని కొమరం భీమ్ భవనం ఆవరణలో ఏటీఏ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఏటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బిజ్జా శ్రీనివాస్ సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 2012 నవంబర్ 9న ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఆవిర్భవించిందని, అప్పటి నుంచి ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు నిర్వహించి విజయాలు సాధించిందని తెలిపారు.

ఏజెన్సీ ప్రాంతంలో ఉపాధ్యాయుల పదోన్నతుల సాధనలో ఏటీఏ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. శాఖాపరమైన సస్పెన్షన్లు, డిప్యూటేషన్లు తదితర సమస్యలను పరిష్కరించడంతో పాటు రిజర్వేషన్ నిబంధనల కారణంగా ఆదివాసీ ఉపాధ్యాయులకు జరుగుతున్న అన్యాయాలను గుర్తించి న్యాయపోరాటాల ద్వారా పదోన్నతులు కల్పించేందుకు కృషి చేసిందన్నారు.

2018లో జిల్లాల పునర్విభజన సమయంలో ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయులను మైదాన ప్రాంతాలకు బదిలీ చేయగా, వారిని తిరిగి ఏజెన్సీ ప్రాంతానికి తీసుకురావడంలో ఏటీఏ ప్రత్యేక కృషి చేసిందన్నారు. 2017 పీఆర్సీలో ఏజెన్సీ అలవెన్స్‌కు సంబంధించిన జీవోను ప్రభుత్వం విస్మరించగా, దశలవారీగా సుదీర్ఘ పోరాటం చేసి 15 నెలల అనంతరం సాధించామని వివరించారు. జీవో ఎంఎస్ నంబర్ 3ను సుప్రీంకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో దాని పునరుద్ధరణ కోసం రివ్యూ పిటిషన్ దాఖలు చేసిన సంఘంగా ఏటీఏ నిలిచిందన్నారు. ఆదివాసీ సమాజంలోని సమస్యల పరిష్కారంలోనూ సంఘం తనవంతు సహకారం అందిస్తూ పెద్దన్న పాత్ర పోషిస్తోందని తెలిపారు.

భవిష్యత్తు కార్యాచరణ.. ప్రభుత్వానికి డిమాండ్లు

ఏజెన్సీ ప్రాంతంలో జీవో నంబర్ 3 స్థానంలో ఆదివాసీలకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రత్యేక చట్టం రూపొందించాలి. రాష్ట్రప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని తక్షణమే అమలు చేయాలి. మిగిలిన నాలుగు విడతల కరువు భత్యం (డీఏ) బకాయిలను మంజూరు చేయాలి.

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషా పండితుల గ్రేడ్2, వ్యాయామ ఉపాధ్యాయులకు అప్‌గ్రేడేషన్ కల్పించి పదోన్నతులు కల్పించాలి.

కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలి.

ఈ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏటీఏ నాయకులు కోరారు.

ఈ కార్యక్రమంలో ఏటీఏ రాష్ట్ర నాయకులు సోయం హనుమంతరావు, రాష్ట్ర మల్టీమీడియా కార్యదర్శి గట్టుపల్లి వెంకటరాం ప్రసాద్, జిల్లా కోశాధికారి జిల్లా వెంకటేశ్వర్లు, సిద్ధబోయిన వెంకటేశ్వర్లు, పడిగ మురళి, కొర్స చిట్టిబాబు, కారం కృష్ణయ్య, పెండేకట్ల ప్రసాద్, పోడెం సునీల్, రేసు వెంకటేశ్వర్లు, యాప మదన్ మోహన్, శేషగిరిరావు, పోడియం నాగేశ్వరరావు, రాంప్రసాద్, శ్రీకాంత్, అయ్యోరి వెంకటేశ్వర్లు, రాజేష్, సోయం కోటేశ్వరరావు, పి. రమేష్, సోడి రాంబాబు, తుర్రం నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం

- **కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇళ్ల నిర్మాణం చరిత్రాత్మకం**
- **పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు**

పాల్వంచ, నవంబర్ 9 (భద్రాద్రిన్యూస్):



పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం చరిత్రాత్మకమని పాల్వంచ సొసైటీ చైర్మన్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.

దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' వేడుకల్లో భాగంగా ఆదివారం పాల్వంచ పట్టణంలోని 36వ డివిజన్ గట్టాయిగూడెంలో కార్పొరేటర్ పైడిపల్లి జయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కొత్వాల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులైన కున్నమల్ల తిరుపతమ్మ, కందుకూరి లావణ్య దంపతులను కార్పొరేటర్ పైడిపల్లి జయలక్ష్మి నూతన వస్త్రాలు అందించి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి కొత్వాల దీపాలు వెలిగించి, టపాసులు కాల్చి దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ పేదలకు సొంత ఇల్లు ఉండాలనే ఆశయంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తూ, నియోజకవర్గానికి 3,500 ఇళ్ల నిర్మాణం చేపట్టడం గొప్ప కార్యక్రమమని కొనియాడారు. ఈ పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కలుగుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 36, 46వ డివిజన్ల కార్పొరేటర్లు పైడిపల్లి జయలక్ష్మి, కొత్వాల విమలాదేవి, హౌసింగ్ ఏఈ సంతోష్, 36వ వార్డు అధికారి సందీప్, కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి మహేష్, నూకల రంగారావు, కొండం వెంకన్నగౌడ్, చింతా నాగరాజు, గుర్రం వెంకటరత్నం, పట్టా వీరకుమార్, నరిగె సుజాత, పాకాలపాటి రోశయ్య చౌదరి, ఎస్.కె. బాషా, ఎస్.కె. మదార్, అమీరుద్దీన్, రజినీకాంత్, చంద్ర వీరయ్య, బండి రఘు, కాపా శ్రీను, కట్టా పుష్ప, ఎస్.కె. షఫీ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి నూతన ఎస్సైగా వి. రమేష్ బాధ్యతల స్వీకరణ!

కారేపల్లి, (భద్రాద్రి న్యూస్ రాములు):



ఖమ్మం జిల్లా కారేపల్లి మండల నూతన ఎస్సైగా వి. రమేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు కారేపల్లి ఎస్సైగా విధులు నిర్వహించిన బైరు గోపి ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న వి. రమేష్ బదిలీపై కారేపల్లికి వచ్చారు.

ఈ సందర్భంగా నూతన ఎస్సై వి. రమేష్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు, అక్రమ రవాణాకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజల వినతులపై పరిష్కార చర్యలు చేపట్టాలి

- **జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు**

భద్రాద్రి న్యూస్ ములుగు

ప్రజావాణిలో అందిన ప్రజల వినతులను పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కార చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. సోమవారం ములుగు జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. అర్జీదారులు తెలిపిన సమస్యలను విని, వారి దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్జీలను సంబంధిత శాఖలవారీగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ అవసరమైన వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, తీసుకున్న చర్యల వివరాలను అర్జీదారులకు తెలియజేయాలని సూచించారు.

ప్రజావాణిలో మొత్తం 19 అర్జీలు అందాయి. వీటిలో భూ సమస్యలకు సంబంధించి 10, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 2, పింఛన్లకు సంబంధించి 2, ఉద్యోగానికి సంబంధించి ఒకటి, ఇతర సమస్యలపై 4 అర్జీలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూములపై గిరిజనేతరుల పెత్తనమా?

- **భూ రీసర్వేలో అక్రమ కబ్జాలను గుర్తించాలి!**
- **అనుభవదారు కాలమ్‌లో 'ప్రభుత్వం' అని నమోదు చేయాలి.. అక్రమ ఆక్రమణదారులపై క్రిమినల్, ఎల్‌టీఆర్ కేసులు నమోదు చేయాలి.. ప్రజావాణిలో ఆదివాసీ నవనిర్మాణ సేన నాయకుల డిమాండ్**

వాజేడు, నవంబర్ 9 (భద్రాద్రి న్యూస్):

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములపై గిరిజనేతరుల అక్రమ ఆక్రమణలను అరికట్టాల్సింది పోయి, భూ రీసర్వే పేరుతో వారినే అనుభవదారులుగా రికార్డుల్లో నమోదు చేయడం ఏమిటని ఆదివాసీ నవనిర్మాణ సేన నాయకులు ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన గిరిజనేతరుల పేర్లను అనుభవదారు కాలమ్ నుంచి తక్షణమే తొలగించి, ఆ స్థానంలో 'ప్రభుత్వం' అని నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వాజేడు మండల ప్రజావాణి (గ్రీవెన్స్ డే)లో సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ భూ రీసర్వే ప్రక్రియ వాజేడు మండలంలో లోపభూయిష్టంగా సాగుతోందని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అమలులో ఉన్న 1917, 1/59, 1/70 భూ చట్టాల స్ఫూర్తికి విరుద్ధంగా సర్వే ప్రక్రియ కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

గిరిజనేతరుల అక్రమ ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి, వాటికి సరిహద్దులు ఏర్పాటు చేయాల్సిన అధికారులు.. అదే భూముల్లో గిరిజనేతరులు సాగులో ఉన్నారనే కారణంతో వారిని అనుభవదారులుగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేస్తున్నారని విమర్శించారు. వారికి పట్టాలు ఇవ్వకపోయినా, అనుభవదారులుగా నమోదు చేయడం భవిష్యత్తులో భూ హక్కుల వివాదాలకు దారితీసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

1917, 1/59, 1/70 చట్టాలు ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరుల భూ హక్కులపై నిర్దిష్ట పరిమితులు విధిస్తున్నాయని, కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు సైతం గిరిజనుల భూముల పరిరక్షణకు ప్రాధాన్యత ఇచ్చాయని గుర్తుచేశారు. అదేవిధంగా సమతా వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును ప్రస్తావిస్తూ, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనేతరుల అక్రమ ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూముల విషయంలో చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

వారి ప్రధాన డిమాండ్లు ఇవే..

1. భూ రీసర్వే ద్వారా గిరిజనేతరుల అక్రమ ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములన్నింటినీ గుర్తించాలి.
2. ఆక్రమిత ప్రభుత్వ భూముల్లో గిరిజనేతరుల పేర్లను అనుభవదారు కాలమ్ నుంచి తొలగించాలి.
3. అనుభవదారు కాలమ్‌లో ప్రభుత్వ భూమిగా స్పష్టంగా నమోదు చేయాలి.
4. అక్రమ భూ ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం క్రిమినల్, ఎల్‌టీఆర్ కేసులు నమోదు చేయాలి.
5. షెడ్యూల్డ్ ప్రాంత భూ చట్టాలను కచ్చితంగా అమలు చేస్తూ గిరిజనుల హక్కులను పరిరక్షించాలి.

ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకుండా భూ రీసర్వే ప్రక్రియను కొనసాగిస్తే, ఆదివాసీ నవనిర్మాణ సేన తరఫున న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని వినతిపత్రంలో స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసీ నవనిర్మాణ సేన ములుగు జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్, ఏఎన్ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్, మండల కార్యదర్శి తల్లడి ప్రసాద్, నాయకులు తల్లడి నానిబాబు, ప్రకాశ్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.









స్కేటింగ్ ఆడుతూ నేషనల్ ప్లేయర్ కు పెను ప్రమాదం.

- **--15 రోజులుగా మంచానికే పరిమితమై సమ్రిన్ అవస్థలు.**
- **--మరో నాలుగు నెలల పాటు బెడ్ రెస్ట్ అవసరమని తేల్చిన వైద్యులు.**
- **--పట్టించుకొని క్రీడా శాఖ, స్కూల్ గేమ్స్ అధికారులు.**

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 9, (భద్రాద్రిన్యూస్):-

స్కేటింగ్ ఆడుతూ జాతీయ క్రీడాకారిణి షేక్ సమ్రిన్ పెను ప్రమాదానికి గురై మంచానికే పరిమితమై అవస్థలు పడుతున్న క్రీడాకారిణి దీనగాథ ఇది. స్కూల్ గేమ్స్ తరఫున రాష్ట్రస్థాయి పోటీలకు తర్ఫీదు పొందుతూ స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో గత నెల 24వ తేదీన స్కేటింగ్ ఆడుతూ ప్రమాదానికి గురై చిన్నారి సమ్రిన్ కుడి కాలు తోటి బాగంలోని ఎముక పక్కకు తొలగడంతో పెను ప్రమాదం జరిగింది. అదే రోజు హుటాహుటిన ఖమ్మంలోని ఒక ప్రైవేట్ హాస్పటల్ కు తీసుకువెళ్లగా పెద్ద సర్జరీ నిర్వహించి ప్రాణాపాయం నుంచి రక్షించినప్పటికీ అప్పటినుంచి మంచానికే పరిమితమై సమ్రిన్ అవస్థలు పడుతున్నది. ఆస్పత్రిలో దాదాపు రెండు లక్షల రూపాయల వరకు ఖర్చు కావడంతో టైలర్ గా జీవనం కొనసాగిస్తున్న సమ్రిన్ తల్లి రేష్మ అప్పుల పాలై తన కూతురుకు చికిత్స చేయించారు. సర్జరీ జరిగినప్పటికీ డాక్టర్లు మరో నాలుగు నెలల పాటు బెడ్ రెస్ట్ తీసుకోమంటూ మందులు వాడమని తెలియజేయడంతో తల్లి రేష్మ కన్నీరు మున్నీరుగా విలపిస్తుంది. తన కూతురు సమ్రిన్ జాతీయస్థాయి, రాష్ట్రస్థాయిలలో గోల్డ్ మెడల్స్ సాధించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింప చేసినప్పటికీ ఇప్పటివరకు క్రీడా శాఖ జిల్లా అధికారులు గానీ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా అధికారులుగాని కనీసం పరామర్శించడానికి కూడా రాలేదు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారి సమ్రిన్ తల్లి రేష్మ టైలరింగ్ చేస్తూ అతి కష్టం మీద తన జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఇకముందు తన కూతురు భవిష్యత్తు పట్ల తల్లి రేష్మ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మంలో ఆరవ తరగతి చదువుతున్న సమ్రిన్ 2021 వ సంవత్సరంలో ఢిల్లీలో జరిగిన 59వ నేషనల్ స్కేటింగ్ పోటీలో అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి అందరి చేత ప్రశంసలు అందుకుంది. అదేవిధంగా ఢిల్లీలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరఫున నిర్వహించిన స్కేటింగ్ పోటీలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచింది. 2023లో పంజాబ్ లోనే మెహాలీలో జాతీయ స్కేటింగ్ పోటీలో స్పీడ్ స్కేటింగ్ విభాగంలో తన క్రీడా నైపుణ్యాన్ని అద్భుతంగా ప్రదర్శించింది. 2021లో స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు గోల్డ్ మెడల్స్ ను సమ్రిన్ సొంతం చేసుకుని జిల్లా ఖ్యాతిని రాష్ట్రస్థాయిలో ఇనుమడింప చేసింది. ఇప్పటివరకు మూడు జాతీయస్థాయి పోటీల్లో, ఐదు రాష్ట్రస్థాయి పోటీల్లో తన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించింది. పలుమార్లు జిల్లా స్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్స్ సమ్రిన్ సొంతం చేసుకుంది. జాతీయస్థాయి, రాష్ట్రస్థాయిలలో జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేస్తూ స్కేటింగ్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ పెను ప్రమాదానికి గురై మంచానికే పరిమితమైన తన కూతురు సమ్రిన్ ను జిల్లా క్రీడా శాఖ అధికారులు, స్కూల్ గేమ్స్ జిల్లా అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్థికంగా, వైద్య పరంగా ఆదుకొని తమకు అండగా నిలవాలని సమ్రిన్ తల్లి రేష్మ అధికారులకు దీనంగా తెలియజేస్తున్నది. క్రీడా సంఘాలు, క్రీడాభిమానులు 9492507286 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించి సహకరించాలని కోరుతున్నారు.





దాతల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి.. చదువుతోనే ఉన్నత శిఖరాలకు చేరాలి!

- **దాతల సహకారాన్ని వృథా చేయొద్దు.. క్రమశిక్షణతో విద్యలో రాణించి సమాజానికి ఆదర్శంగా నిలవాలి!**
- **కొమరం భీం విద్యార్థి నిలయంలో విద్యార్థులకు దీపావళి విందు.. అర క్వింటా బియ్యం వితరణ**

చర్ల, నవంబర్ 9 (భద్రాద్రి న్యూస్):

దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని వనవాసీ కళ్యాణ పరిషత్ భద్రాద్రి జిల్లా కార్యదర్శి కోరం సూర్యనారాయణ పిలుపునిచ్చారు. దాతల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా విద్యార్థులు విద్యలో రాణించి తల్లిదండ్రులకు, విద్యా సంస్థకు, తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

హైదరాబాద్‌కు చెందిన పట్నాల జానకిరాం - మల్లీశ్వరి దంపతులు, వారి కుమారుడు వంశీ ఫణీంద్ర - నవ్యశ్రీ, మనవడు విరాజ్ కార్తికేయల కుటుంబం తరఫున గరిక తాతయ్య, ఆయన సతీమణి గరిక సత్తెమ్మల జ్ఞాపకార్థం కొమరం భీం విద్యార్థి నిలయానికి అర క్వింటా బియ్యాన్ని వితరణగా అందించారు. అదేవిధంగా దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వివిధ రకాల కూరలతో భోజనం, స్వీట్లు, పండ్లు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా కొమరం భీం విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కోరం సూర్యనారాయణ మాట్లాడుతూ.. మారుమూల అటవీ ప్రాంత గ్రామాలకు చెందిన గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించాలనే లక్ష్యంతో విద్యార్థి నిలయాలు పనిచేస్తున్నాయని తెలిపారు.

విద్యార్థులు ఇతర వ్యాపకాలపై దృష్టి మళ్లించకుండా చదువుపైనే ఏకాగ్రత పెట్టాలని, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ క్రమశిక్షణతో ముందుకు సాగాలని హితవు పలికారు. విద్యార్థుల చదువును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉపాధ్యాయులతో చర్చించి నాణ్యమైన విద్య అందేలా కృషి చేయాలని నిర్వాహకులకు సూచించారు. విద్యతోనే జీవితాల్లో మార్పు సాధ్యమని, ఉన్నత స్థాయికి చేరుకున్న వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు.

హైదరాబాద్‌లో స్థిరపడినప్పటికీ జానకిరాం - మల్లీశ్వరి దంపతులు ప్రతి ఏటా ఇక్కడి విద్యార్థులకు సేవా కార్యక్రమాల ద్వారా సహకారం అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు దాతలు చేస్తున్న సహకారం మరువలేనిదని పేర్కొన్నారు.నిలయ కమిటీ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ మాట్లాడుతూ.. దాతలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులు బాగా చదివి సంస్థతో పాటు తల్లిదండ్రులకు, తమ ప్రాంతానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు. గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం దేశవ్యాప్తంగా వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో 443 విద్యార్థి నిలయాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారంతోనే ఈ విద్యార్థి నిలయాలు కొనసాగుతున్నాయని, విద్యార్థుల భవిష్యత్తు కోసం అండగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిలయ కమిటీ ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాధికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, శబరి బాలికా నిలయం కార్యదర్శి బందా స్వరూపరాణి, లవన్ కుమార్ రెడ్డి, నిలయ ప్రముఖ్ సంతోష్, ముకేష్ తదితరులు పాల్గొన్నారు.



